క్లుప్తంగా

పోలమాంబ సన్నిధిలో అన్నదానం



భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న ఈవో కె.గాయత్రి

ఏయూ క్యాంపస్: శ్రీపోలమాంబ అమ్మవారి ఆలయంలో శనివారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. వార్షిక జాతరలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు. ముందుగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ ఈవో కె.గాయత్రి, పురోహితులు, సిబ్బంది స్వయంగా వడ్డించారు.

చిన్నారుల యోగ శిబిరానికి విశేష స్పందన



యోగ సాధన చేస్తున్న చిన్నారులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా విలేజ్‌లో నిర్వహిస్తున్న చిన్నారుల ఉచిత యోగ శిక్షణ శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రతి రోజు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతోంది. నగరంలోని చిన్నారులు ఉత్సాహంగా ఈ శిబిరంలో పాల్గొని యోగాసనాలు వేస్తున్నారు. యోగా కేంద్రంలో సుశిక్షితులైన శిక్షకుల పర్యవేక్షణలో ఏకాగ్రతకు ఉపకరించే యోగాసనాలు నేర్పుతున్నట్లు కేంద్రం విభాగాధిపతి ఆచార్య కె.రమేష్‌బాబు తెలిపారు.

ప్రిన్సిపాల్ రాజు మృతికి సంతాపం



రాజు మృతదేహం వద్ద కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో ఓ ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్ ఏటూరి చిట్టిరాజు(51) శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణితో కలిసి వెళ్లి రాజు మృతదేహానికి నివాళులర్పించారు. రాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆరిలోవ ప్రైవేట్ పాఠశాలల యూనియన్ సభ్యులు కూడా రాజు మృతదేహం వద్ద అంజలి ఘటించారు.

ఏయూలో నిర్మాణ పనుల పరిశీలన



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ ఎం.జేమ్స్‌స్టీఫెన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న పలు నిర్మాణ పనులను రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ శనివారం సాయంత్రం పరిశీలించారు. హాస్టళ్ల చుట్టూ తలపెట్టిన రాతి ప్రహరీ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. పనుల ప్రగతిని యూనివర్సిటీ ఇంజినీర్ ఆర్.శంకరరావు, ఇంజినీరింగ్ వర్క్స్ డీన్ ఆచార్య కె.శ్రీనివాసరావు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్స్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డెవలప్‌మెంట్ వాచ్: అద్దంలా రహదారులు



జీవీఎంసీ 12వ వార్డులో బీఆర్‌టీఎస్ చినగదిలి కూడలి వద్ద నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం నుంచి సూర్యతేజానగర్ వరకు రూ.2.35 కోట్లతో 60 అడుగుల వెడల్పుతో విస్తరించిన రోడ్డు



విశాలాక్షినగర్ సమీప సీతకొండ మలుపు వద్ద వైఎస్సార్ సీ వ్యూ పాయింట్ నుంచి సుమారు 400 మీటర్ల పొడవున రూ.4 కోట్లతో 80 అడుగులకు విస్తరించిన రహదారి

తూర్పు నియోజకవర్గంలో రహదారులు మోక్షం కలిగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రోడ్ల రూపురేఖలు మారిపోయాయి. దాదాపు అన్ని ప్రాంతాల్లో కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఇరుకుమయంగా, గోతులతో ఉన్న రహదారులు ఇప్పుడు కళకళలాడుతున్నాయి. సీఎం వైఎస్ జగన్ సర్కారు వచ్చిన తర్వాత రూ.కోట్లు నిధులు వెచ్చించి రోడ్లు నిర్మించారు. – ఆరిలోవ



పెదవాల్తేరులో కాలనీలో సుమారు రూ.40 లక్షలతో నిర్మించిన రోడ్డు



జీవీఎంసీ 13వ వార్డు ఆరిలోవ కాలనీ పాండురంగాపురంలో నిర్మించిన సీసీ రోడ్డు. ఈ తరహా రహదారుల కోసం సుమారు రూ.50 లక్షలు వెచ్చించారు

ఎంవీవీ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరికలు



టీడీపీ, జనసేన నుంచి పార్టీలో చేరిన యువత, మహిళలతో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, తదితరులు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 27వ వార్డు అమర్‌నగర్‌కు చెందిన 50 మందికి పైగా జనసేన, టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. శనివారం వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ సమక్షంలో లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ వారికి వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా రంజక పాలనకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు ఆరు వెల్లడించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అఖండ విజయానికి పెద్ద ఎత్తున కృషి చేయాలని ఈ సందర్భంగా వారికి ఎంవీవీ సూచించారు. పార్టీలో చేరిన వారిలో రమణమ్మ, సత్య, లక్ష్మి, తవుడమ్మ, జి.లక్ష్మి, రవిరాజు, రామకృష్ణ, గణేష్, దేవరాజు, తదితరులు ఉన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

బీచ్ రోడ్డు: శతశాతం ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని గ్రీన్ క్లైమేట్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం కోరారు. స్వీప్ ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం బీచ్‌రోడ్డులో ఆయన ఓటర్లను చైతన్యపరిచారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఐదేళ్ల పాటు మనల్ని సజావుగా పాలించే నాయకులను ఎన్నుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న జేవీ రత్నం

సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్



ప్రసంగిస్తున్న ఎం.వి.వి సత్యనారాయణ



హాజరైన గ్రామస్తులు

- మహిళలను లక్షాధికారులను చేసిన ఘనత వైఎస్సార్‌సీపీదే
- 15 ఏళ్లలో వెలగపూడి చేసింది శూన్యం
- ఆత్మీయ సమావేశంలో తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ

ఏయూ క్యాంపస్: సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. శనివారం రాత్రి 20వ వార్డులో కాగితాల వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంవీవీ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత, ప్రాతినిధ్యం కల్పించారన్నారు. అదే విధంగా మహిళలను లక్షాధికారులను చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వెలగపూడి నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, బొత్స ఝాన్సీని ఎంపీగా గెలిపించాలని ఎంవీవీ విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎంవీవీని గ్రామస్తులు, కాగితాల వారి కుటుంబ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, కార్పొరేటర్ ముఖ్వల లక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి పి.వి. నారాయణ, ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, పార్టీ మండల అధ్యక్షుడు ముఖ్వల సురేష్, కాగితాల వారి కుటుంబం పెద్దలు కాగితాల రాంబాబు, కాగితాల సత్యనారాయణ, కాగితాల లక్ష్మణరెడ్డి, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నేడు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు కేంద్రం గౌరవ సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కేజీహెచ్ విశ్రాంత సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.ఈశ్వరరావు రోగులను పరీక్షించనున్నారు. రోగులు తమ రిపోర్టులను తీసుకురావాల్సి ఉంటుంది. ఇతర సమాచారం కోసం 94401 91673 నంబరులో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

జాలరిపేట అభివృద్ధికి కట్టుబడి ఉన్నా.. మద్దతివ్వండి

- జగనన్నతోనే మత్స్యకారుల ప్రగతి సాధ్యం
- 19వ వార్డు సిద్ధం సభలో తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ

ఎంవీపీ కాలనీ: జాలరిపేట అభివృద్ధిని కాంక్షించే ప్రతి ఓటరూ వచ్చే ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలవాలని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ కోరారు. 19వ వార్డు జాలరిపేటలో శనివారం పార్టీ నాయకుడు జీవీ రామచంద్రరావు ఆధ్వర్యంలో మేము సిద్ధం-మా బూత్ సిద్ధం పేరిట నిర్వహించిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నియమితులైన నాటి నుంచి జాలరిపేట అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. రూ.కోట్ల నిధులు వెచ్చించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన విషయం జాలరిపేట వాసులందరికీ తెలుసన్నారు. ఇదే తరహాలో వచ్చే ఐదేళ్లలో జాలరిపేటను మోడల్ వార్డుగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా సేవలందిస్తానని ఎంవీవీ హామీ ఇచ్చారు. ఇందుకు ఈ ప్రాంత ప్రజలంతా ఎన్నికల్లో తనకు, వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ మేలు జరిగిందన్నారు. మత్స్యకారులకు అన్ని రకాల సంక్షేమ పథకాలతో పాటు వేట విరామం సమయంలో భృతిని సైతం సీఎం జగన్ ప్రభుత్వం పెంచిందని చెప్పారు. జగనన్నతోనే మత్స్యకారుల ప్రగతి సాధ్యమన్నారు. హుద్‌హుద్ ఇళ్ల కేటాయింపు, అర్హులకు స్థలాలు ఇలా అన్నింటా మత్స్యకారులకు సముచిత స్థానం కల్పించామన్నారు. ఈ సభలో పార్టీ నగరాధ్యక్షుడు కోలా గురువులు, పార్టీ నాయకులు పీవీ నారాయణ, రాజబాబు, సూరాడ దాసు, వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి, పలువురు డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో కలిసి డ్యాన్స్ చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



సిద్ధం సభకు హాజరైన జాలరిపేట వాసులు



మాట్లాడుతున్న ఎంవీవీ సత్యనారాయణ

ప్రచార పర్వం



ఆరిలోవ: ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ తరఫున 11వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గొలగాని శ్రీనివాస్, నాయకులు



ఆరిలోవ: 13వ వార్డులో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు కెల్ల సత్యనారాయణ, కార్యకర్తలు



ఎంవీపీ కాలనీ: ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరుతూ 17వ వార్డు 137వ పోలింగ్ బూత్ పరిధిలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ గేదెల లావణ్య, తదితరులు



ఎంవీపీ కాలనీ: వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బొత్స ఝాన్సీ, ఎంవీవీ సత్యనారాయణకు మద్దతుగా 17వ వార్డు ఆదర్శనగర్‌లో ప్రచారం చేస్తున్న జిల్లా మహిళా విభాగం కార్యదర్శి పిల్లా సత్యవతి, తదితరులు



బీచ్ రోడ్డు: 15వ వార్డు సింహాద్రిపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు, పీలా వెంకట్, ఈశ్వరరావు, కృష్ణ, బొడ్డేటి రామకృష్ణ, వీర్రాజు, పోల్‌రాజు, వెంకటరావు



బీచ్ రోడ్డు: జనం గుండెల్లో ఎంవీవీ.. ఎంవీవీ గుండెల్లో జనం అంటూ 16వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, తదితరులు



బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు నెహ్రూనగర్, గోపాలం పార్క్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, నాయకులు



ఏయూ క్యాంపస్: 20వ వార్డులో సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు మద్ది పోలిరెడ్డి, బి.రమాదేవి, పండరీబాయి, బుజ్జి, తదితరులు

ఎంవీపీ రైతుబజార్ సందర్శన



రైతుబజార్ ఆవరణలో ఆర్గానిక్ స్టాల్‌ను పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ప్రశాంతి

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌ను శనివారం మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ప్రశాంతి సందర్శించారు. స్టాళ్లను పరిశీలించారు. ఏయే కూరగాయలు, ఏయే ప్రాంతాల నుంచి ఇక్కడికి తీసుకొస్తున్నారో రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది రైతులు ఉన్నారు.. స్టాళ్ల నిర్వహణ, తదితర అంశాల గురించి రైతుబజార్ ఈవో జి.ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇక్కడున్న ఆర్గానిక్ స్టాల్‌ను పరిశీలించారు. అందులో విక్రయిస్తున్న ఉత్పత్తులు, వాటి ధరలు గురించి నిర్వాహకులను ఆరా తీశారు. ఈ సందర్భంగా రైతుబజార్ నిర్వహణ బాగుండాలని సూచించారు. వినియోగదార్లకు ధరలు విషయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా, అసౌకర్యం కలిగించే పరిస్థితులు రాకుండా చర్యలు చేపట్టాలని ఈవోను ఆమె ఆదేశించారు. ఈ పర్యటనలో ఆర్‌జేడీఎం సుధాకర్, డీడీఎం యెర్రన్న, డీపీటీఎంవో ఎస్.కె.యాసిన్ పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థుల ముమ్మర ప్రచారం



ప్రచారం చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి ఆదాడ రమణి

ఆరిలోవ: విశాఖ తూర్పు నియోజకవర్గంలో బరిలో నిలిచిన స్వతంత్ర అభ్యర్థులు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ప్రచార రథాలతో హోరెత్తిస్తున్నారు. శనివారం స్వతంత్ర అభ్యర్థి ఆదాడ రమణి తనకు ఓటు వేసి గెలించాలని కోరారు. ఉమ్మడి భాస్కరరావు తనను గెలిపించాలని ప్రచారం చేశారు.

నా ఆస్తులు విక్రయించైనా స్టీల్‌ప్లాంట్‌ను కొంటా

సీతమ్మధార : తన ఆస్తులు విక్రయించైనా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కొంటానని, నిర్వహణ బాధ్యతలు ఇస్తే చాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ అన్నారు. ఆశీలమెట్టలోని ఫంక్షన్ హాల్లో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. డాక్యుమెంటరీ ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయకుండా కోర్టు ఆర్డర్ తెచ్చానన్నారు. విశాఖ ఎంపీగా తనను గెలిపించాలని కోరారు. యేసుక్రీస్తు ఏకైక లోక రక్షకుడు అన్నారు. తాను గెలిస్తే పదిరత్నాలు అమలు చేస్తానని, ప్రజలు కుండ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. పవన్ కల్యాణ్ తమ పార్టీలోకి వస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో నేతలు ఏసుపాదం, రవి కుమార్, జ్యోతి, శ్యామ్ మాథ్యూల్ పాల్గొన్నారు.